క్లుప్తంగా

వైభవంగా హరిహరక్షేత్రం వార్షికోత్సవం


స్వామివారికి పట్టువస్త్రాలు, పంచామృతాలు సమర్పిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

చీమకుర్తి: చీమకుర్తిలోని హరిహరక్షేత్రం 19వ వార్షికోత్సవాన్ని శనివారం రెండో రోజు వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ నిర్వాహకుడు శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్, శిద్దా పాండు రంగారావు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోని సకల దేవతలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన నగరోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు హాజరయ్యారు.

పున్నమి పురుషోత్తమునికి కళ్యాణం


స్వామివారి ఎదురుకోలులో అర్చకులు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని ప్రసన్నచెన్నకేశవస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం స్వామివారికి అశ్వవాహనంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో చలువచొప్పరం ఎదురుకోలును వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కళ్యాణ క్రతువులను శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి అన్న ప్రసాదం అందించారు. కార్యనిర్వహణాధికారి రావెళ్ల శివశంకర్ పర్యవేక్షించారు.

రోజుకు 92 వేల మందికి ఉపాధి

సంతనూతలపాడు: జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజుకు 92,000 మంది కూలీలు పనిచేస్తున్నట్టు డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ తెలిపారు. 2023–24 సంవత్సరంలో చేసిన పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్‌పై సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో పీడీ పాల్గొని మాట్లాడారు. మార్చి 13 నుంచి 28వ తేదీ వరకు గ్రామాల్లో చేసిన పనులను పరిశీలించినట్లు తెలిపారు. ఎంపీడీవో డి.సురేష్‌బాబు, ఎస్‌ఆర్‌పీ మూర్తి, ఎంపీపీ బుడంగుంట విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, మండల ఏపీవో వాసంతి, పంచాయతీరాజ్ ఏఈ వీరాంజనేయులు, విజిలెన్స్ సీఓ ప్రసాదు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘పల్లెకు పోదాం’ ద్వారా ప్రజా సమస్యల గుర్తింపు

నాగులుప్పలపాడు: బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకోనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, పొగాకు బోర్డు డైరెక్టర్ పొద వరప్రసాద్ తెలిపారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉప్పుగుండూరులో ఆయన పర్యటించారు. గ్రామంలో తాగునీటి సమస్య, కమ్యూనిటీ సెంటర్ ఏర్పాటు గురించి ప్రజలు అర్జీలు అందజేసినట్లు తెలిపారు. వీటిని సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసి త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లచ్చంశెట్టి టీగ్రా, గంగవరపు యొబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

హనుమంత అవతారంలో రఘునాయకుడు

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ రఘునాయకస్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారు శనివారం హనుమంత అవతారంలో వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో అనిల్ పర్యవేక్షణలో స్వామివారిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రామాంజనేయ యుద్ధం ఆకట్టుకుంది. హనుమంత అవతారం ఉభయదాతలుగా బీ నిడమానూరు గ్రామానికి చెందిన రామకోటయ్య శర్మ వ్యవహరించి స్వామివారికి ఉభయం అందజేశారు.


హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

జగనన్న వెంటే జనం


ప్రభలపై డ్యాన్సర్ల సందడి

- ఆయన ఎక్కడకెళ్లినా ప్రభంజనం
- 2029లో మళ్లీ జగనన్నే సీఎం
- చంద్రబాబుకు ఓటేసి మోసపోయామంటున్న ప్రజలు
- జిల్లాలో వైఎస్సార్ సీపీ శ్రేణులకు బూచేపల్లి కుటుంబం అండగా ఉంటుంది
- చీమకుర్తి మందిరాల సంబరాలలో బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జున


వైఎస్సార్ సీపీ ప్రభపై మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జున

చీమకుర్తి: జగనన్న పులివెందులకే కాదు.. రాష్ట్రానికే ముద్దు బిడ్డ అని, ఆయన రాష్ట్రంలో ఎక్కడ అడుగుపెట్టినా జనప్రభంజనమేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో చీమకుర్తి మందిరాల సంబరాలలో వైఎస్సార్ సీపీ తరఫున ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై బూచేపల్లి శివప్రసాదరెడ్డితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ సీపీ జెండా పట్టే ప్రతి కార్యకర్త కుటుంబానికి బూచేపల్లి కుటుంబం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తమ కుటుంబానికి పదవి ఉన్నా..లేకున్నా, అధికారం ఉన్నా..లేకున్నా వైఎస్సార్ సీపీ జెండాను భుజాన పెట్టుకుని జగనన్నను 2029లో సీఎం చేసేంత వరకు అండగా నిలుస్తామన్నారు.

మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంటు వంటి పలు సంక్షేమ పథకాలు రాకపోవడంతో చంద్రబాబుకు ఓట్లేసి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎం చేసుకోవాలని నిర్ణయించుకుని ఆ అవకాశం కోసం ఆతృతగా జనం ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్ని శక్తులు ఏకమైనా 2029లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం కాకుండా ఎవరూ ఆపలేరన్నారు. పార్టీ కార్యకర్తలకు బూచేపల్లి కుటుంబం అండగా ఉండటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రభలపై డ్యాన్సర్లు, యాంకర్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌బాబు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, చీమకుర్తి కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

23 సినిమా హీరో సందడి



23 సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆ చిత్ర హీరో తేజ, హీరోయిన్ తన్మయి, డైరెక్టర్ రాజ్ శనివారం ఒంగోలులోని గోరంట్ల కాంప్లెక్స్‌లో సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంచి చిత్రాన్ని ఆదరించాలని కోరారు.

– సాక్షి, ఒంగోలు

చీకట్లో జీజీహెచ్.. నరకం చూసిన రోగులు


జీజీహెచ్ మెయిన్ గేట్ వద్ద చీకట్లో రోగులు


వార్డులో సెల్‌ఫోన్ లైటు వెలుతురులో ఒక మహిళ

ఒంగోలు టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయంతో శనివారం రోగులు ఇబ్బంది పడ్డారు. రాత్రి 8 నుంచి 8.30 గంటల వరకు కరెంటు పోయింది. దీంతో ఆస్పత్రి మొత్తం చీకటిగా మారిపోయింది. చిన్నపిల్లల వార్డులోని పసిబిడ్డలు ఒక్కసారిగా ఏడ్పు అందుకున్నారు. మహిళల విభాగం నుంచి మహిళలు బయటకు వచ్చేశారు. ఐసీయూ, ఎస్ఐసీయూలో గాలి ఆడక రోగులు నరకం అనుభవించారు. రాత్రి కావడంతో ఆస్పత్రికి సంబంధించిన అధికారులెవరూ అందుబాటులో లేక కిందిస్థాయి సిబ్బంది ఏం చేయాలో పాలుపోక గందరగోళంలో పడ్డారు. సర్వజన ఆస్పత్రికి జనరేటర్లు ఉన్నాయి. వాటికి నెలవారీగా బిల్లులు చేసుకుంటూనే ఉన్నారు. కానీ, కరెంటు పోయిన వెంటనే జనరేటర్లను స్టార్ట్ చేయకపోవడంతో తిరిగి కరెంటు వచ్చేంత వరకు రోగులు, వృద్ధులు, చిన్నారులు చీకట్లోనే మగ్గిపోతూ అవస్థపడ్డారు. కొందరు రోగుల సహాయకులు తమ దగ్గర ఉన్న సెల్ ఫోన్లలో లైట్ వెలిగించుకుని కూర్చున్నారు. బయటకు వెళ్లి ఉన్న రోగుల సహాయకులు వెంటనే తమ వారి వద్దకు చేరుకున్నారు. మొత్తం మీద కాసేపు ఆస్పత్రిలో రోగులు భయాందోళనకు గురయ్యారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ వచ్చివెళ్లి 24 గంటలు కూడా గడవక ముందే ఆస్పత్రి అంధకారంగా మారడంతో అధికారుల నిర్లక్ష్యంపై రోగులు మండిపడుతున్నారు. ఆస్పత్రిలో ఆటోమేటిక్ జనరేటర్ ఉందని, సాంకేతిక సమస్య వలన వెంటనే అది స్టార్ట్ కాకపోవడంతో కాస్త ఇబ్బంది ఏర్పడిందని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీ నాయక్ తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల సత్తా


శ్రీ సరస్వతీ కాలేజీ విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రమణారెడ్డి


ఉమామహేశ్వర కాలేజీ విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ మల్లేశ్వరరావు


శ్రీ ప్రతిభ కాలేజీ విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు


శ్రీ హర్షిణి కాలేజీ విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ రవికుమార్



చీమకుర్తి ఎంఎస్ఆర్ కాలేజీ విద్యార్థులు
బీ శివాని (984) ఎం దివ్యశ్రీ (464)


శ్రీచైతన్య విద్యార్థులను అభినందిస్తున్న డీన్ రామకృష్ణ


నారాయణ విద్యార్థులను అభినందిస్తున్న డీన్ మధుసూదన్‌రెడ్డి


ఎస్ఎస్ఎన్ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివానందరెడ్డి

ఒంగోలు సిటీ: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పలు కాలేజీల విద్యార్థులు సత్తా చాటారు. ఒంగోలులోని శ్రీ సరస్వతీ కాలేజీలో ఎంపీసీ సీనియర్ ఇంటర్ విద్యార్థులు బండి హర్షిణి 991/1000, కొడవలి హేమలత 991/1000, ఎనిమిరెడ్డి సిరి 991/1000, సీనియర్ బైపీసీలో పాలకీర్తి హారికజాయ్ 991/1000 మార్కులు సాధించినట్లు చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో మండ్ల వెంకటవిష్ణు 466/470, ఈ.రిషిత్‌కుమార్‌రెడ్డి (466), టి.వెంకటమహీధర్‌రెడ్డి (466), సంతోష్‌రెడ్డి (466), ఎస్.చందన (466), భార్గవి (466), ఎన్.నిహిత (466), బాలవైష్ణవి (466), ఎన్.మహిత (466) సత్తాచాటారని అభినందించారు.

ఉమామహేశ్వర కాలేజీ విద్యార్థులు...
ఒంగోలులోని ఉమామహేశ్వర కాలేజీ విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సీహెచ్ లావణ్య (987), బి.ప్రసన్న (983), కె.అంబికాలక్ష్మి (981), పి.పరినిత (980), సీనియర్ బైపీసీలో ఎం.సుజిత (984), జి.తనూజ (984) మార్కులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ మల్లేశ్వరరావు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో కె.అవినాస్ (464), పి.జయసాయిప్రభాషిణి (464), ఎం.పవన్‌కళ్యాణ్ (463), ఎస్.హేమలత (461), జూనియర్ బైపీసీలో ఎం.మాధురి (429), జూనియర్ ఎంఈసీలో ఐ.వి స్లోక (470) మార్కులు సాధించారని అభినందించారు.

శ్రీ ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు...
శ్రీ ప్రతిభ విద్యాసంస్థల్లో సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు గొర్ల శృతి (990), సీహెచ్ స్నేహ (990), కె.వెంకటకళ్యాణ్‌రామ్ 989, టి.మౌనిక 988, శెట్టి పూజిత 988, సీహెచ్ వెంకటత్రిష 987, అద్దంకి వంశీ 987, కె.వెంకట మహాలక్ష్మి 987 మార్కులు సాధించి సత్తాచాటారని చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు అభినందించారు. బైపీసీలో వెలుగు హాసిని 987, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఆరె సాయిధీరజ్ 465/470, మాకినేని మనోజ్ 465, షేక్ అసరుద్దీన్ 465, బైపీసీలో డి.పూజిత 433, దాసరి వైశాలి 430, పిన్నక సంతోషిణి 429 మార్కులు సాధించారని వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ అభినందనలు తెలిపారు.

శ్రీ హర్షిణి జూనియర్ కళాశాల విద్యార్థులు...
శ్రీ హర్షిణి జూనియర్ కళాశాల విద్యార్థులు జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బత్తుల ధరణి 466/470, ఎస్.భార్గవి, పి.లక్ష్మీనారాయణ, పి.హృదయ బాబు 465 మార్కులు, జూనియర్ బైపీసీలో జి.ఉజ్వల హర్షిణి 431/440 మార్కులు సాధించినట్లు కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ తెలిపారు. ఎంఈసీలో 467/500 మార్కులు, సీఈసీలో 465/500 మార్కులు, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో అడక మధు కిరణ్ 988/1000 మార్కులు, ఎస్.కె షీరున్నీష 988 మార్కులు సాధించినట్లు చెప్పారు. వి.జాన్ తేజ, యూ.శ్రావణి 986 మార్కులు, బైపీసీలో కటారి హారిక 973 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎంఈసీలో సుహాసి 953 మార్కులు, సీఈసీలో సింగమశెట్టి సాయి దుర్గ 959 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులను అభినందించారు.

ఎస్ఎస్ఎన్ కాలేజీ విద్యార్థులు...
ఒంగోలు మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో హవా కొనసాగించినట్లు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్లటూరి శివానందరెడ్డి తెలిపారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో శివానందరెడ్డి మాట్లాడారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎస్.సావిని, పి.జోషిత 470 మార్కులకుగానూ 465 మార్కులు సాధించి సత్తాచాటారన్నారు. 464 మార్కులు నలుగురు విద్యార్థులు, 463 మార్కులు ఇద్దరు విద్యార్థులు, 462 మార్కులు ఇద్దరు విద్యార్థులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల అకాడమిక్ డీన్ ఎం.జానార్దన్‌రెడ్డి, డీన్ ఎం.జనార్దన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపక బృందం అభినందించారు.

శ్రీ చైతన్య విద్యార్థులు...
ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థల సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు బత్తుల తేజస్విని 988, ఎం.సౌమ్యశ్రీ 988, జి.వర్షిత సాయిలక్ష్మి 988 మార్కులు సాధించినట్లు ఒంగోలు బ్రాంచ్ డీన్ ఎం.రామకృష్ణ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో షేక్ మహ్మద్ ఇమాన్ 466/470, డి.వర్షిణి 465/470 మార్కులు సాధించి సత్తాచాటారన్నారు.

నారాయణ కళాశాల విద్యార్థులు...
ఒంగోలు నారాయణ కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థులు ఎంపీసీలో పి.భవజ్ఞ ప్రియ, జి.ప్రణతి దత్తసాయి 466/470 మార్కులు సాధించగా, డి.దేవి అక్షయ, కౌసల్య మనో$\mathcal{}$్జ, డి.సాహితీ 465/470 మార్కులు సాధించారు. 460కిపైగా మార్కులు 28 మంది సాధించారు. బైపీసీ విద్యార్థులు హాసిని 434/440, హఫీఫా 427 మార్కులు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ ఆర్.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో షేక్ రైజా 1000కి 990, గీతిక 989 మార్కులు సాధించారన్నారు. 980కిపైగా మార్కులు 26 మంది సాధించారని వారిని అభినందించారు.

చీమకుర్తి ఎంఎస్ఆర్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ...
చీమకుర్తి: ఇంటర్ ఫలితాల్లో చీమకుర్తి ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారు. కాలేజీ ప్రిన్సిపాల్ వీవీ శివారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సీనియర్ ఇంటర్ ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో బల్లిపల్లి శివాని 1000 మార్కులకు 984 మార్కులు సాధించింది. జూనియర్ ఇంటర్ ఎంపీసీ ఇంగ్లిష్ మీడియంలో మాకాని దివ్యశ్రీ 470 మార్కులకుగానూ 464 మార్కులు సాధించింది. సీనియర్ ఇంటర్ బైపీసీ గ్రూపులో ముక్తవరపు శ్రీవాణి 1000 మార్కులకుగానూ 970 మార్కులు, సీఈసీ గ్రూపులో గుంజి రిబ్కా 1000 మార్కులకు 917 మార్కులు సాధించింది. ప్రతిభ చాటిన విద్యార్థులను కాలేజీ అధ్యాపకులు, వారి తల్లిదండ్రులు అభినందించారు.

పీ4 పేరుతో ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలి


- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: పీ4 సర్వే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని, తక్షణ అభివృద్ధిపై దృష్టి సారించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎప్పుడో పాతిక ముప్పయ్ సంవత్సరాల తర్వాత జరిగే అభివృద్ధి గురించి గొప్పగా ప్రచారం చేసుకోవడం మానేయాలని హితవుపలికారు. వేల కోట్ల రూపాయల రాయితీ పొందుతూ, వేలాది ఎకరాలు అప్పనంగా పొందిన కార్పొరేట్ కంపెనీల సంపదపై, ఆస్తులపై పన్నులు వసూలు చేసి అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీల సీఎస్‌ఆర్ నిధి నుంచి రెండు శాతం ఖర్చు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అమెరికాలో ప్రవాస భారతీయులు అవమానాల పాలవుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నోరు తెరిచి మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో గత 25 ఏళ్లుగా 1.48 లక్షల ఎకరాల పంటలు పండే భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించారని, ఆ భూముల్లో ఇప్పటి వరకు ఎన్ని కంపెనీలు వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. పరిశ్రమల పేరుతో సేకరించిన భూముల్లో కనీసం 20 శాతం కూడా పరిశ్రమలు స్థాపించలేదని, 45 వేల ఎకరాలకుపైగా భూములు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పరిశ్రమల పేరుతో కొందరు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఎగ్గొట్టారని, మరికొందరు భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. మన్నవరం బీహెచ్‌ఎల్ కంపెనీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.4 వేల కోట్లు ఇప్పటి వరకు ఇవ్వలేదని, తిరుపతిలో 150 ఎకరాలలో ఉన్న పంచదార పరిశ్రమను ప్రభుత్వం ఎత్తివేసిందని తెలిపారు. ఇక్కడ ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.30 కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు రోడ్డునపడ్డారని చెప్పారు. జిల్లాలో నిమ్జ్ పేరుతో 14 సంవత్సరాల క్రితం 20 వేల ఎకరాలు సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం.. కనీసం ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదని చెప్పారు. తొలుత మార్క్సిస్టు యోధుడు మాకినేని బసవపున్నయ్యకు ఘనంగా నివాళులర్పించారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు, పూనాటి ఆంజనేయులు, జీవీ కొండారెడ్డి పాల్గొన్నారు.

మా ఊరిని కాపాడండి సార్

- సర్వేరెడ్డిపాలెం గ్రామస్తుల ఆవేదన


సమావేశంలో మాట్లాడుతున్న సర్వేరెడ్డిపాలెం గ్రామస్తులు

ఒంగోలు టౌన్: మట్టి తవ్వకాలతో మట్టికొట్టుకుపోతున్న మా గ్రామాన్ని కాపాడండి సార్ అంటూ ఒంగోలు మండలంలోని సర్వేరెడ్డిపాలెం గ్రామస్తులు వేడుకుంటున్నారు. గ్రామానికి చెందిన మక్కెన వెంకటేశ్వర్లు శనివారం స్థానిక ఎంసీఏ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ గ్రామంలోని 2.46 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు భూమిని దాసరి సుబ్బయ్యకు డీకే పట్టా (161–1985)గా ఇచ్చినట్లు తెలిపారు. సదరు భూమి వాగు పోరంబోకు కావడంతో వ్యవసాయం గిట్టుబాటు కాక సుబ్బయ్య వలసవెళ్లిపోయినట్లు చెప్పారు. అయితే, గ్రామానికి చెందిన బబ్బూరి వీరబ్రహ్మం, అతడి భార్య శైలజ తప్పుడు దస్తావేజులు సృష్టించి ఆ భూమికి పట్టాలు పొందారని ఆరోపించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆ భూమిలో గ్రావెల్ తవ్వి ఒంగోలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. రోజుకు కనీసం 100 టిప్పర్లలో పగలూరాత్రి తేడాలేకుండా గ్రావెల్ తరలిస్తున్నారని చెప్పారు. దీంతో సదురు భూమి పక్కనే ఉన్న తమ భూములు లోతట్టు ప్రాంతంగా మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాకుండా వందల వాహనాలతో మట్టి తవ్వకాలు జరుపుతుండడంతో వాయుకాలుష్యం వలన పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. గ్రామం లోపల నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో గ్రామస్తులు అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. స్కూలుకు వెళ్లే పిల్లలు, గ్రామంలోని వృద్ధులు, మహిళలు కాలుష్యం బారిన పడి అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ విషయంపై మీకోసంలో, మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.